సాక్షి
నిర్మల్
ఆదివారం । 18 । జూన్ । 2023



మాయ 'లేడి'

కొలువుల ఆశ చూపి నిరుద్యోగులను బురిడీ కొట్టించింది ఈ మాయలేడి. రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఘరానా మోసానికి పాల్పడింది.

10లో▸

నూతన కలెక్టరేట్‌లో ఫిర్యాదుల విభాగం

- అదనపు కలెక్టర్ రాంబాబు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగాన్ని వచ్చే సోమవారం నుంచి ఎల్లపల్లిలోని నూతన సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ పి.రాంబాబు తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గమనించి పాత కలెక్టరేట్‌కు వెళ్లకుండా కొత్త కలెక్టరేట్‌కు రావాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.6 /29.6

అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి. ఉదయం 9 గంటల నుంచే వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వేడిగాలులు వీస్తాయి. అర్ధరాత్రి వరకూ వేడి సెగలు ఉంటాయి.

న్యూస్‌రీల్

మహిళా సంఘాలకు చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన తెలంగాణ గిరిజన దినోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ నిధులతో నిర్మల్‌లో ప్రారంభించబోతున్న మినరల్ మిక్చర్, పాల ప్యాకింగ్ ప్లాంట్లకు మంజూరు చేసిన రూ.56 లక్షల చెక్కును మహిళా సంఘాలకు మంత్రి, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డితో కలిసి అందించారు.

ధాన్యం డబ్బుల కోసం ధర్నా



రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

దస్తురాబాద్: కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు చెల్లించా లని మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన రైతులు పాండ్వాపూర్ –కలమడుగు రహదారిపై శనివారం ధర్నా చేశారు. రహదారిపై వాహనాలు నిలిచి పోవడంతో ఘటన స్థలానికి ఎస్సై ప్రభాకర్‌రెడ్డి చేరుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. ధాన్యం డబ్బులు రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామ ని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు మల్లేశ్, ప్రభాకర్, నర్సయ్యగౌడ్, గంగన్న, రాజు, సత్తన్న, రాజు, రాజేశ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మానవ విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

లక్ష్మణచాంద: విద్యార్థులు విద్యతోపాటు మానవ విలువలు పెంపొందించుకోవాలని సీడీపీవో నాగమణి విద్యార్థులకు సూచించారు. వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో మార్పు కోసం జీవన బడి అనే ప్రత్యేక కార్యక్రమం ఈ నెల 12 నుంచి 16 వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వలంటీర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు సాటి మనిషిని గౌరవించడం, విలువలు, సంస్కారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యను నేర్చుకోవడంతోపాటు తన తోటి విద్యార్థులతో మర్యాదగా నడుచుకోవడం, గౌరవించడం, విలువలు పెంపొందించుకోవాలన్నారు. సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. వరల్డ్ విజన్ సంస్థ సేవలను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇందులో ఏవో ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, వరల్డ్‌విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, సభ్యులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.100కే అప్ అండ్ డౌన్ టికెట్

నిర్మల్ టౌన్ : పల్లెవెలుగులో ప్రయాణించే ప్రయాణికులకు ఈనెల 18 నుంచి రూ.100 కే టీ9 టికెట్ పేరుతో 60 కిలో మీటర్ల వరకు రాను పోను ప్రయాణించే అవకాశం ఆర్టీసీ కల్పించినట్లు నిర్మల్, భైంసా ఆర్టీసీ డిపో మేనేజర్లు సాయన్న, అమృత తెలిపారు. ఈ టికెట్ ద్వారా రూ.20 నుంచి రూ.40 డబ్బు ఆదా చెయ్యవచ్చని పేర్కొన్నారు. ఇది మహిళలకు, సీనియర్ సిటీజన్ల కు వర్తిస్తుందని తెలిపారు. కండక్టర్ వద్ద ఈ టికెట్ లభిస్తుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని వెల్లడించారు.

22న ద్విచక్ర వాహనాల వేలం

భైంసాటౌన్: అక్రమంగా మద్యం తరలిస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఈనెల 22న వేలం వేయనున్నట్లు భైంసా ఎక్సైజ్ సీఐ నజీర్‌హుస్సేన్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఐదు ద్విచక్రవాహనాలను వేలం వేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భైంసా ఎక్సైజ్ శాఖ కార్యాలయ ఆవరణలో ఈనెల 22న ఉదయం 11 గంటల నుంచి వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు 50 శాతం ఈఎండీ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.



నాన్న.. ది గ్రేట్

Happy Father`s day

నిర్మల్: అమ్మ జన్మనిస్తే.. నాన్న జీవితాన్ని ఇస్తాడు. అమ్మ కంటికి రెప్పలా చూసుకుంటే .. నాన్న కష్టాలు రాకుండా కావలి కాస్తాడు. అమ్మ కష్టం అందరికీ కనిపిస్తే.. నాన్న కష్టాన్ని గుండెల్లో దాచేసుకుంటాడు. అలుపెరగని సైనికుడై జీవన పోరాటం చేస్తాడు. తన అలసటని కూడా కనపడనీయకుండా బతుకుబండిని నడిపిస్తాడు.బాధ్యతల బరువులు మోస్తూ ఎన్నో త్యాగాలు చేస్తాడు. వెలకట్టలేని ప్రేమకు చిరునామా నాన్న. నాన్న.. పైకి కరుకుగా కనిపిస్తున్నా.. తన మనసు మాత్రం వెన్న. బిడ్డ వేసే తొలి అడుగు మొదలు.. ప్రతీ అడుగులో నాన్న తోడుంటాడు. తనకెంత కష్టమైనా.. తను ఎంత బాధను అనుభవిస్తున్నా.. పైకి మాత్రం చిరునవ్వులు చిందిస్తూ.. తన పిల్లలకు నవ్వులు పంచుతాడు. రాత్రి ఇంటిల్లిపాది గుండెల మీదుగా చేయివేసుకుని హాయిగా నిద్రపోతారు. కానీ.. నాన్న గుండెల నిండా రేపటి ఆలోచనలే. తన పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ.. ఏ అర్ధరాత్రి దాటిన తర్వాతో కళ్లుమూసుకుంటాడు. మళ్లీ పొద్దు పొడవక ముందే తన తపన మొదలవుతుంది. కుటుంబం కోసం క్షణం తీరిక లేకుండా కష్టపడతాడు. పిల్లల కడుపు నిండితే చాలు.. తాను సగం కడుపుతోనైనా సంతృప్తి పడతాడు. పిల్లల నవ్వుల్లో.. వాళ్ల ఆనందాల్లో.. తన సంతోషాన్ని వెతుక్కుంటాడు. బిడ్డ ప్రయోజకుడైతే ముందుగా గర్వించేది నాన్నే. ఎందుకంటే తన నిలువెత్తు బిడ్డ విజయం వెనుక ఉన్నదీ.. ఈ నాన్నే. అందుకే నాన్న ఓ రియల్ హీరో. 'నాన్నా..' అన్న పిలుపుతోనే పరవశిస్తూ.. తన జీవితాన్ని ధారబోస్తున్న తండ్రులకు హ్యాట్సాఫ్.
నేడు 'ఫాదర్స్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం.

- పిల్లల ప్రతీ అడుగులో అండగా నిలిచి..
- స్నేహితుడిలా సలహాలిస్తూ.. సన్మార్గంలో నడిపిస్తూ..
- తను కిందికి ఒదుగుతూ.. తన పిల్లలు ఎదిగేలా చేస్తూ..
- భవితకు బలమైన పునాదిలా నిలుస్తూ..
- రియల్ హీరోగా నిలుస్తున్న.. నాన్న

భూమన్నా.. నువ్వు గ్రేటన్న..

'మా కాలంలో పైసలు లేక చదువు చిన్నప్పుడే ఆపేసిన. చదువు లేక చేసేందుకు మంచి పని దొరకక పరేషానైంది. చివరకు బస్టాండ్‌లో మూటలు మోసే పనికి కుదిరిన. అప్పుడు తెలిసింది.. చదువు విలువ. నాలాగా నా పిల్లలకు కష్టం రావొద్దనుకున్న. ఇందుకు చదువొక్కటే మార్గమనుకున్న. నాకెంత ఇబ్బందైనా సరే.. పిల్లలు బాగా చదివేందుకు కష్టపడ్డ. నా కష్టానికి తగ్గట్లే పిల్లలు బాగా చదివారు. సమాజంలో ప్రయోజకులుగా నిలబడ్డారు. ఇవ్వాళ్ల ప్రతిఒక్కరూ 'భూమన్న.. నువ్వు గ్రేటన్న..'అని అంటుంటరు. ఓ తండ్రిగా నాకింతకన్న ఏం కావాలె..' ఇవీ తన శ్రమకు తగ్గ ట్లు ఫలితాని చ్చిన కుటుంబాన్ని చూసుకుంటూ ఓ బాధ్యతగల తండ్రిగా కుంట భూమన్న చెబుతున్న మాటలు. పిల్లల భవిష్యత్తు కోసం మూటలు మోస్తూ.. వారిని ముత్యాల్లా పెంచారు.

రెక్కలు ముక్కలు చేసుకుని..

నిర్మల్ జిల్లాకేంద్రంలోని చింతకుంటవాడకు చెందిన కుంట భూమయ్య, పోసాని దంపతులకు జయ, విజయ, సుజాత ముగ్గురు కుమార్తెలు, శ్రీహరి, ఉమామహేశ్వర్, రమణేశ్వర్ ముగ్గురు కుమారులు. వీరిది సాదాసీదా కుటుంబం. ఇల్లు గడవడానికి భూమయ్య నిర్మల్ బస్టాండ్‌లోనే హమాలీగా పనిచేశారు. చిన్నప్పుడు ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో భూమన్న రెండో తరగతి వరకే చదివారు. తాను చదువుకోక పోవడం వల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందని అప్పుడు కాదు.. ఇప్పటికీ చెబుతుంటారు. తన బిడ్డలకు మాత్రం ఎలాంటి కష్టం రావద్దనుకున్నారు. అందుకోసం పగలురాత్రి కష్టపడి తన తాహతుకు మించి చదివించారు. ఫీజులు చెల్లించే పరిస్థితి లేకపోతే అప్పులు చేసేవారు. మళ్లీ తన కష్టంతోనే వాటిని తీర్చేవారు.

తండ్రి కష్టం వృథా పోలేదు..

తమ కోసం నాన్న పడుతున్న కష్టాలను కళ్లారా చూసిన పిల్లలూ ప్రయోజకులుగా మారి.. తమ తండ్రి పేరు నిలబెట్టారు. కుంట భూమన్న పెద్దకుమారుడు శ్రీహరి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి, పదోన్నతిపై జూనియర్ కళాశాల ఆ తర్వాత ఇటీవల డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. రెండో కుమారుడు ఉమామహేశ్వర్ బీటెక్ పూర్తి చేసి దక్షిణాఫ్రికాలో మైనింగ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ సొంతంగా పలు గనులను తీసుకున్నారు. పెద్ద కూతురు జయను పదోతరగతి వరకు, రెండో కుమార్తె విజయను ఎంఏ వరకు చదివించారు. చిన్న కూతురు సుజాత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించారు. ఇక చిన్న కుమారుడు రమణేశ్వర్ ఏకంగా ఎంబీబీఎస్, ఎంఎస్, ఎంసీహెచ్ న్యూరోసర్జన్ పూర్తి చేశారు. ప్రస్తుతం నిజామాబాద్, నిర్మల్‌లో వైద్యసేవలు అందిస్తూ తనకంటూ మంచి పేరు సంపాదించారు.

చదువే ప్రయోజకున్ని చేసింది..



మా కాలంలో పైసలు లేక చదువు ఆపేసిన. పిల్ల లకు తమలా ఏకష్టం రావొద్దనుకున్న. చదువొక్కటే ఇందుకు సమాధానం అని అనుకున్న. ఇప్పటికీ నేను ఇదే చెబుతున్న. పిల్లల కు ఆస్తులు అంతస్తులు ఇవ్వకున్నా సరే. మంచి చదువును అందించాలి. అదే వాళ్లను ప్రయోజకుల్ని చేస్తుంది. జీవితంలో నిలబెడుతుంది.

– కుంట భూమయ్య, తండ్రి

చదువు గురించే చెప్పేవారు..



మానాన్న మాకోసం చిన్నప్పటి నుంచి చాలా కష్టపడ్డారు. అమ్మానాన్నల కష్టం చూస్తూ పెరిగాం కాబట్టే ఈరోజు ఓ స్థాయికి చేరుకున్నాం. నాన్న ఎప్పుడూ చదువు గురించే చెప్పేవారు. అదే మాకు ఈరోజు ప్రయోజకులను చేసింది.

– కుంట శ్రీహరి, డిగ్రీ లెక్చరర్

ఈస్థాయికి చేర్చింది.



ఆస్తిపాస్తులు లేకున్నా మానాన్న తన కష్టంతో మమ్మల్ని చదివించారు. ఆయన ఆరోజు చేసిన ఆలోచనే మమ్మల్ని ఈస్థాయికి చేర్చింది. తను పడే కష్టం చూస్తే చాలా బాధేసేది. అందుకు కష్టపడి చదివాం. ఇవ్వాళ్ల సౌత్ ఆఫ్రికాలో సొంత గనులకు యజమాని దాకా చేరుకున్నం.

– ఉమామహేశ్వర్, మైనింగ్ ఇంజినీర్, సౌత్ ఆఫ్రికా

నాన్న శ్రమ ఫలితమే..



మా నాన్న మా కోసం పడ్డ కష్టమే మమ్మల్ని ఇలా ప్రయోజకులను చేసింది. అమ్మ కూడా అన్ని కష్టాలకు ఓర్చి మమ్మల్ని తీర్చిదిద్దింది. కూలీ డబ్బులు సరిపోక పోతే అప్పులు చేసి చదివించారు. నాన్న పడ్డ కష్టం, కుటుంబసభ్యుల సహకారమే నన్ను డాక్టరయ్యేలా చేసింది.

– డాక్టర్ రమణేశ్వర్, న్యూరోసర్జన్

నాన్నే నాకు స్ఫూర్తి..

నిర్మల్‌ఖిల్లా: వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న దిగువ మధ్యతరగతి కుటుంబం అది. సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామానికి చెందిన బాశెట్టి నడిపన్న వంశపారంపర్యంగా వస్తున్న వ్యవసాయం ప్రధానవృత్తి కాగా తనకు ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు. ప్రస్తుతం తన కొడుకు బి.రవికుమార్ నిర్మల్‌లో పెద్ద డాక్టర్‌గా సేవలందిస్తున్నాడు. నడిపన్న తన ఇద్దరు కూతుళ్లను కూడా మంచిగా చదివించి పెళ్లిచేసి పంపించాడు. కొడుకును పదో తరగతి వరకు స్వగ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివించాడు. ఇంటర్మీడియట్ నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో చదివించాడు. కొడుకును ఎలాగైనా డాక్టర్ ను చేయాలనే ఉద్దేశంతో ఇంటర్ తర్వాత కష్టమైనా ఎంసెట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు పంపించాడు. నాన్న ఆశయం మేరకు తన కొడుకు బాశెట్టి రవికుమార్ సైతం పట్టుదలతో ఎంబీబీఎస్ సీటును సాధించి కోర్సును పూర్తి చేసుకున్నాడు.



చేనులో మనుమడిని ఆడిస్తున్న నడిపన్న

బాపు కష్టాన్ని దగ్గర్నుంచి చూసి..

తన తండ్రి కష్టాన్ని దగ్గరగా చూసిన వ్యక్తిగా రవికుమార్ తాను ఎంబీబీఎస్‌తోపాటు పీజీని కూడా పూర్తి చేయాలని సంకల్పంతో ఉండేవాడు. ఎంబీబీఎస్ పూర్తయిన అనంతరం కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మెడికల్ ఆఫీసర్‌గా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేశాడు. ఉద్యోగం చేస్తూనే, ఆర్థికంగా కుదుటపడ్డాక, పట్టుదలతో మరింత శ్రమించి ఎండీ జనరల్ ఫిజీషియన్ సీటుని సాధించాడు. అనంతరం తన పీజీని పూర్తిచేసుకుని వచ్చిన రవికుమార్ ప్రస్తుతం నిర్మల్‌లో ప్రభుత్వ వైద్యుడిగా మంచి గుర్తింపు కూడా తెచ్చుకున్నాడు. తన తండ్రి కష్టంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని చెబుతాడు డాక్టర్ రవికుమార్.

మాకోసం ఎంతో చేశాడు..



నాన్నే నా హీరో.. మా కోసం ఎంతగానో కష్టపడ్డాడు. ఆ కష్టాలను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తిగా ప్రస్తుతం నేను నాన్న బాగోగులను చూసుకుంటున్నా. బిజీ లైఫ్‌లో కూడా తీరిక చేసుకుని జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామమైన చించోలిబి కి వెళ్లి నాన్నతో కలిసి వ్యవసాయ పనుల్లో పాలు పంచుకుంటా. నా పిల్లల్ని సైతం మా నాన్న దగ్గరే.. ప్రకృతికి దగ్గరగా పెంచుతున్నా.

– రవికుమార్, డాక్టర్

ఆ కూతుళ్లకు చెవులు, గొంతుక నాన్నే...

కుంటాల: కుంటాలకు చెందిన సాంగ్వి శ్రీనివాస్–హంస దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఆడపిల్లలు పుట్టడంతో మహాలక్ష్మి తమ ఇంట్లో అడుగు పెట్టారని భావించారు. కానీ పిల్లలు ఎదుగుతున్న కొద్దీ వారిలో వైకల్యాలు బయటపడ్డాయి. ఇద్దరూ పుట్టుకతో మూగ, చెవిటి. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా నయం రాదు. ఇక నయం కాదని తెలిసి పిల్లలకు తల్లిదండ్రులే చెవులు, గొంతుక అయ్యారు.



కూతుళ్లతో సాంగ్వి శ్రీనివాస్.

మూడేళ్ల క్రితం తల్లి మృతి..

పిల్లలు దివ్యాంగులని ఆ తల్లిదండ్రులు ఏనాడూ చీత్కరించుకోలేదు. చిన్నచూపు చూడలేదు. సాధారణ పిల్లలతో సమానంగా పెంచాలని చదువు చెప్పిస్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం తల్లి హంస అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో పిల్లలు మరింత కుంగిపోయారు. కానీ శ్రీనివాస్ అన్నీ తానే అయ్యాడు. తల్లి లేని లోటు తెలియకుండా పెంచుతున్నాడు. పెద్ద కూతురు అక్షయ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి, చిన్న కూతురు అనుప్రియ స్థానిక ఆదర్శ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది.

సైగలతో సపర్యలు..

ప్రతీరోజు పిల్లలను నిద్రలేపడం నుంచి మొదలు.. రాత్రి నిద్రపుచ్చడం వరకు అన్నీ శ్రీనివాసే చూసుకుంటున్నాడు. కూతుళ్లకు మాటలు రాకపోవడం, చెవులు వినిపించకపోవడంతో సైగలతో అర్థం చేసుకుని సపర్యలు చేస్తుంటాడు. పిల్లలను తన కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు

సాధారణ ప్రసవాలు ప్రోత్సహించాలి

- డీఎంహెచ్‌వో ధనరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్: జిల్లాలో సాధారణ ప్రసవాలు పెంచి, సిజేరియన్ కాన్పులు తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో, భైంసా ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న గైనకాలజిస్టులతో శనివారం వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు పరీక్షలకు వచ్చినప్పటి నుంచే సాధారణ పసవాలతో కలిగే ప్రయోజనాల గురించి, సిజేరియన్ డెలివరీతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈమేరకు ఐఈసీ మెటీరియల్ తయారు చేశామని పేర్కొన్నారు. ఇది అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. కరపత్రాల ద్వారా ప్రతి గర్భిణికి అవగాహన కల్పించాలని తెలిపారు. అధికంగా సిజేరియన్ కాన్పులు చేసే ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీసీ అండ్ పీఎన్ డీటీ సందర్భంగా యాక్ట్ 1994, రికార్డుల నిర్వహణ గురించి సమావేశంలో వివరించారు. సమావేశాల్లో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రాజేందర్, భైంసా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ నిఖిలారాణి, డాక్టర్ శ్రీనివాస్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, నిర్మల్, భైంసా డివిజన్ల పరిధిలోని గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

20 జగన్నాథ రథయాత్ర



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలో హరే కృష్ణ మందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీజగన్నాథ రథ యాత్ర పోస్టర్‌ను రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 20న స్థానిక గాంధీచౌక్‌లోని మురళీకృష్ణ ఆలయం నుంచి సాయంత్రం నాలుగు గంటలకు రథోత్సవం ప్రారంభం అవుతుందని తెలిపారు. పట్టణ పురవీధుల గేండా రథ యాత్ర భాగ్యనగర్ శ్రీరాధాకృష్ణ మందిరం వరకు కొనసాగుతుందని హరేకృష్ణ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చే యాలని కోరారు. కార్యక్రమంలో నరేందర్, అనిల్, హరేకృష్ణ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

'ఎన్‌ఎస్‌యూఐని బలోపేతం చేయాలి'



నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంతోపాటు జిల్లాలో ఎన్‌ఎస్‌యూఐని బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఏఐసీసీ కార్యదర్శి మాణిక్‌రావు థాక్రే ఆదేశానుసారం ప్రతీ మండలంలో కొత్త నాయకత్వానికి పదవులు కేటాయించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో అత్యధిక రిజిస్ట్రేషన్ చేసిన వారికి పదవులు కేటాయిస్తామన్నారు. బీఆర్ఎస్ కులాల వారీగా బీజేపీ మతాల వారీగా విభజించి పాలిస్తున్నాయని ఆరోపించారు. బాసర ట్రిపుల్‌ఐటీ సమస్యలపై ప్రజలకు తెలిసేలా మొట్టమొదట పోరాటం చేసింది ఎన్ఎస్‌యూఐ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వరాజ్, అఖిలేశ్, కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, అల్లూరి మల్లారెడ్డి, ఎంబడి రాజేశ్వర్, ఎంబడి రాకేశ్, ప్రతాప్‌రెడ్డి, పొద్దుటూరి రమణారెడ్డి, గంగోని బురాజ్, కొంతం గణేశ్, ప్రశాంత్, సంజిత్, ఇమ్రాన్ కౌన్సిలర్ మొహమ్మద్ మతిన్ కిసర్ పాల్గొన్నారు.

విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న పాఠశాలల్లో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. గ్రామస్థాయిలో, పాఠశాల స్థాయిలో, జిల్లాస్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గ్రామస్థాయిలో కార్యక్రమాలు......

- గ్రామంలో ఉదయం 7:30 నుంచి 8:45 వరకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ.
- విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ప్రగతిని అందరికీ వివరించాలి.
- కూడళ్లలో వీధి నాటకాలు వేయించి, ప్రభుత్వ పాఠశాల పటిష్టతను, ప్రగతిని తెలియజేయాలి.

పాఠశాల స్థాయి కార్యక్రమాలు.. :

- ఉదయం 9:30 నుంచి 11.00 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి.
- మామిడి ఆకులు, తోరణాలతో పాఠశాలను, పాఠశాల పరిసరాలను అందంగా అలంకరించాలి.
- తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దలు, దాతలు, ఇతర అధికారులను పాఠశాలకు ఆహ్వానించి ఉదయం జాతీయ జెండాను ఆవిష్కరించాలి.
- రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు విద్యా ప్రగతి గురించి తెలియజేయాలి.
- పాఠశాలలలో మన ఊరు–మనబడి కింద ఎంపికైన పాఠశాలలో కల్పించిన 12 రకాల సౌకర్యాలు, వసతుల గురించి అందరికి వివరించాలి.
- ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థి మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించడానికి ఏర్పాటు చేసిన తొలిమెట్టు కార్యక్రమాలు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీలు, రీడింగ్ కార్నర్ల గురించి తెలియజేయాలి.
- మన ఊరు – మనబడి కింద ఎంపికైన పాఠశాలల్లో రీడింగ్ కార్నర్స్, లైబ్రరీలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు ప్రారంభించాలి.
- పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత నోటు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయాలి.
- పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దాతలను సన్మానించాలి.

జిల్లా స్థాయి కార్యక్రమాలు..

- జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్స్‌లో జిల్లా స్థాయి కార్యక్రమాలు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతాయి. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరవుతారు.
- జిల్లాస్థాయిలో పాఠశాలలకు ప్రభుత్వం ఉచితంగా అందించిన 553 టాబ్‌లను పంపిణీ చేస్తారు.
- జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలతో సత్కరిస్తారు.
- 10 మంది ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, ఐదుగురు ఉత్తమ తల్లిదండ్రులు, ఐదుగురు ఉత్తమ ఎస్ఎంసి చైర్మన్లను జ్ఞాపికలతో సత్కరిస్తారు.
- జిల్లాలో ఏదైనా పాఠశాలకు విరాళాలు, వస్తుపరంగా గానీ, భూమిపరంగాగానీ దానం ఇచ్చిన దాతలను సత్కరిస్తారు.

క్లుప్తంగా

'విద్యార్థినులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటరమణ

భైంసాటౌన్(ముథోల్): బాసర ఆర్జీయూకేటీలో 70 శాతానికిపైగా బాలికలే ఉన్నారని, ఈ నేపథ్యంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు తరచూ కౌన్సెలింగ్ నిర్వహించాలని వర్సిటీ వీసీ వెంకటరమణ సూచించారు. ఈ మేరకు శనివారం డీడబ్ల్యూవో విజయలక్ష్మి, డీసీపీవో దేవి మురళితో కలిసి ఆయన కాన్ఫరెన్స్ హాల్‌లో మాట్లాడారు. 15 రోజులకు ఒకసారి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వర్సిటీ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ పోస్టర్ ఆవిష్కరించారు.

బోథ్‌లో పాల శీతలీకరణ కేంద్రం

సాక్షి స్పందన

బోథ్: బోథ్ మండల కేంద్రంలో పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనచారి తెలిపారు. శుక్రవారం 'ప్రారంభం కాదు..మూసివేతనేనా' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వెయ్యి లీటర్ల సామర్థ్యం గల పాలశీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పాల శీతలీకరణ పరికరాలు పనికిరాకుండా పోవడంతో వాటిని స్క్రాప్‌లో విక్రయిస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బోథ్‌లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేస్తామన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 23 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన 23 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షలవిభాగం అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ నరేందర్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెన్నూర్‌లో ఇద్దరు, ఇచ్చోడలోని సాయి సమత్ డిగ్రీ కళాశాలలో ఎనిమిది మంది, కాకతీయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఛత్రపతి డిగ్రీ కళాశాలలో ఆరుగురు, మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లిలోని భవిత డిగ్రీ కళాశాలలో నలుగురు డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 2న పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. బైక్ యజమాని అల్లాపూర్ స్వప్నిల్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా మహాగావ్ తాలూకా శివరాం గావ్ గ్రామానికి చెందిన దీపక్ భబన్‌రావు దొంగిలించినట్లు గుర్తించారు. బైక్ స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు టూటౌన్ ఎస్సై విష్ణు తెలిపారు.

వండర్‌ఫుల్ రికార్డులు

సండే స్పెషల్

- ఒక్కొక్కరిది ఒక్కో రికార్డు
- పాటలు.. శ్లోకాలు.. భజనలు..
- ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో మనోళ్లు

మనకు తెలిసిన రెండు మూడు భాషల్లో పాటలు పాడగలం.. కానీ 17 భాషల్లో పాడితే అదో రికార్డు. తక్కువ సమయంలో 186 దేశాల కరెన్సీ గుర్తిస్తే మరో రికార్డు.. బుల్ బుల్ సితార్ నిర్విరామంగా వాయిస్తే ఇంకొక రికార్డు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో. కాదేది రికార్డుకు అనర్హం. అన్ని రికార్డుల సమాహారమే ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు. ఏదైనా ఒక రికార్డు సాధించాలంటే కృషి.. పట్టుదల.. నిరంతర సాధన.. లక్ష్యంపై గురి ఉండాల్సిందే. అలా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చాలామంది ఒక్కో అంశాన్ని ఎంచుకుని రికార్డు సాధించి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో తమ పేరు పదిలం చేసుకున్నారు. వీరిలో కొందరిపై ప్రత్యేక కథనం.

– సాక్షి, మంచిర్యాలడెస్క్



అద్వికకు రికార్డు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న వండర్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులు(ఫైల్)

- మంచిర్యాలకు చెందిన ప్రముఖ బుల్‌బుల్ సితార్ కళాకారుడు చుంచు గురువయ్య విరామం లేకుండా ఏడు గంటలపాటు బుల్ బుల్ సితార్ వాయించినందుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డు అందుకున్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లోని బూర్ల పవన్‌కుమార్ ఏడు గంటలపాటు నిర్విరామంగా డోలక్, భజన పాటల ద్వారా రికార్డు సృష్టించాడు.
- మంచిర్యాలకు చెందిన నామని వెంకట అద్విక 189 దేశాల పేర్లు, కరెన్సీని గుర్తిస్తుంది. నాలుగు నిమిషాల్లోనే గుర్తించడం ద్వారా రికార్డుకెక్కింది.
- మంచిర్యాలకు చెందిన కొమ్మెర విశ్వేశ్వర వర్మ జ్యోతిష్య, వాస్తు సలహాదారు. శ్రీదేవి ఉపాసకులైన ఆయన లలిత పారాయణాన్ని 108మంది సభ్యులు, 108 రోజులు, 108 ఇళ్లలో నిర్వహించారు. లలిత సేవా సమితి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా రికార్డు సాధించారు.
- మంచిర్యాలకు చెందిన విద్యార్థులు వేనంపల్లి వేదాంత్ సాయి, సిద్ధాంత్ సాయి 75రకాల విత్తనాలు.. ఒక్కో రకంతో ఒక్కో భారతదేశం పటం .. ఇలా 75 భారతదేశ చిత్రపటాలను రూపొందించారు. 75వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చేసిన ఈ ప్రయత్నం ద్వారా రికార్డుకెక్కారు. గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా రికార్డు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.
- మంచిర్యాలలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో రంగస్థలం కార్యక్రమం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కట్ల భాగ్యలక్ష్మి 24గంటల 24 నిమిషాల 24 సెకన్లు ప్రాచీన కళలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, స్టేజీ డ్రామాలు నిరంతరాయంగా ప్రదర్శించారు. 2022 జూన్ 4, 5వ తేదీల్లో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా రికార్డు సొంతం చేసుకున్నారు. మొదటిసారిగా వెయ్యి మంది కళాకారులను సన్మానించారు.

జీవితంలో మరిచిపోలేను..

కోమటిచేను సాయిబాబా ఆలయంలో నిర్విరామంగా బుల్ బుల్ సితార్ వాయించాను. బుల్ బుల్ సితార్ అనేది పురాతన వాయిద్యం. నాకు 21ఏళ్లు ఉన్నప్పటి నుంచి వాయించడం మొదలు పెట్టాను. గత 40 ఏళ్లుగా ఉచితంగానే ప్రదర్శనలు ఇస్తున్నాను. ఆలయాల్లో కొందరితో కలిసి వందలాది భజనలు చేశాను. స్టార్ మేకర్‌లో వెయ్యి వరకు పాటలు పాడాను. సింగరేణిలో పని చేస్తున్న సమయంలో కోలిండియా స్థాయి పోటీల్లో పదిహేను సార్లు బహుమతి పొందాను. ఆలయంలో ఏడు గంటలు నిర్విరామంగా బుల్ బుల్ సితార్ వాయించడం ద్వారా రికార్డు సృష్టించాను. నా జీవితంలో మరిచిపోలేను. గవర్నర్ తమిళిసై చేత ప్రశంసలు పొందాను.



– చుంచు గురువయ్య, బుల్ బుల్ సితార్ కళాకారుడు

- నిర్మల్‌లోని బాగులవాడకు చెందిన అల్లం నవీన్ వరి విత్తనాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటం తయారు చేశాడు. ఆరు వేల విత్తనాలు వినియోగించి ఒక్కో దానిపై కేసీఆర్ అనే పదాలు రాశాడు. ఇది పూర్తి చేయడానికి ఐదు నెలల సమయం పట్టింది. పేదలకు బియ్యం పంపిణీ, హరితహారం పథకాలను స్ఫూర్తి పొంది రూపొందించాడు.
- ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బెల్లంపల్లి బ్రాంచి ఆధ్వర్యంలో దుర్గాదేవి నిజరూప ప్రదర్శన నిర్వహించారు. 108 మంది దుర్గామాత వేషధారణలో ఆకట్టుకున్నారు. గత ఏడాది అక్టోబర్ 4న జరిగిన కార్యక్రమంలో ఒకే వేదిక ద్వారా దుర్గాదేవి వేషధారణతో రికార్డుకెక్కారు.
- మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గృహిణి వేముల మానస 150 నిమిషాల్లో 2,800 శ్లోకాలు పఠించి రికార్డు సృష్టించారు. నిరంతరాయంగా మూడు గంటలపాటు ప్రవచనాలు చెప్పగలుగుతారు. రామాయణానికి సంబంధించిన ప్రవచనాలపై ఆమెకు గొప్ప అవగాహన ఉంది. శ్లోకాలు కంఠస్థం చేయడానికి ఆమెకు ఎనిమిదేళ్ల సమయం పట్టింది.
- మంచిర్యాలకు చెందిన కట్టోజి జాహ్నవి 17భాషల్లో పాటలు పాడగలదు. తెలుగు పద్యాలు, డైలాగ్‌లు చెప్పగలదు. తెలుగు, తమిళం, కన్నడ, ఉర్దూ తదితర భాషల్లో పాటలు పాడి రికార్డు సృష్టించింది. రికార్డు తర్వాత ఆమె మరో మూడు భాషల్లోనూ ప్రావీణ్యం సాధించింది.

బోధన మారథాన్

మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన నేరెళ్ల శ్రీధర్‌గౌడ్ 30 గంటల బోధన మారథాన్ నిర్వహించడం ద్వారా రికార్డు సృష్టించాడు. 2016లో వరంగల్‌లోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. 'ప్రిన్సిపుల్స్ ఇన్ డ్రగ్ కెమిస్ట్రి అండ్ అనలైటికల్ టూల్స్' అంశంపై బోధన చేశాడు. అనుబంధంగా నాలుగు అంశాలపై సాగిన బోధన 2016లో మార్చి 21న ఉదయం 11గంటలకు ప్రారంభమై మరుసటి రోజు సాయంత్రం ఐదు గంటల వరకు సాగింది.

చిన్నారులు భళా..

మంచిర్యాలకు చెందిన చీకోటి శ్రేయాంక్ 150 దేశాల జెండాలను అలవోకగా గుర్తిస్తాడు. ఇండియా, చైనా, భూటాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల జాతీయ పతాకాలను 60 సెకండ్లలో గుర్తించడం ద్వారా రికార్డు దక్కింది.

- ఆదిలాబాద్‌కు చెందిన రిమ్‌షా ఫిర్దోస్ అద్భుత జ్ఞాపకశక్తితో అబ్బురపరుస్తోంది. 86 దేశాల రాజధానులను నిమిషంలో, 29 రాష్ట్రాల రాజధానులను 16సెకండ్లలో, 800 జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంది. 2016 జూన్ 7న ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తన ప్రతిభతో రికార్డు సృష్టించింది.
- మంచిర్యాలకు చెందిన అకినపల్లి శర్మిష్ఠ అప్యత్ బహుముఖ ప్రజ్ఞ ద్వారా బ్లైండ్ ఫోల్ విభాగంలో రికార్డు సృష్టించాడు. కళ్లకు గంతలు కట్టుకుని చేతితో తాకడం ద్వారా అంకెలు, కరెన్సీ నోట్లు, గుర్తించడం, క్యూబ్‌ను ఏదైనా ఒక వైపు కలర్‌ను పూర్తి చేయడం చేస్తాడు.

వాల్మీకి రామాయణం ప్రవచనమే లక్ష్యం



వాల్మీకి రామాయణాన్ని అమితంగా ఇష్టపడతాను. స్వతహాగా నేను భక్తురాలిని. రాముడిపై ఉన్న మమకారంతో రామాయణంలోని శ్లోకాలను నేర్చుకోవాలని ప్రయత్నించాను. ఇప్పటివరకు మూడు వేల పైచిలుకు శ్లోకాలు నేర్చుకున్నాను. 2,800 శ్లోకాలను రెండున్నర గంటల వ్యవధిలో ప్రవచించడంతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నాకు స్థానం దక్కింది. ఏడు ఖండాలుగా ఉన్న వాల్మీకి రామాయణాన్ని కంఠస్థం చేసి ప్రవచించడమే నా అంతిమ లక్ష్యం. భర్త శ్రీనివాస్, కుటుంబ సభ్యుల తోడ్పాటు ఎంతగానో ఉంది. – వేముల మానస, బెల్లంపల్లి

సమాజంలో ప్రత్యేక గుర్తింపు



ఈ రికార్డుల వల్ల సమాజంలో ప్రత్యేక ప్రతిభతో గుర్తింపు లభిస్తుంది. ఏదైనా ఒక విద్యలో నిష్ణాతులుగా ఉండి.. ఎవరూ చేయనిది.. మనకంటూ ప్రత్యేకత కలిగిన వాటిని ఎంచుకుని పరిపూర్ణంగా ప్రదర్శిస్తే చరిత్రలో ఒక రికార్డుగా నిలిచిపోతుంది. భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయి. మనకు వచ్చే అవార్డులు, రికార్డులు సాక్ష్యంగా నిలుస్తాయి. యోగా డే రోజు మరో రెండు రికార్డులు నమోదు చేయనున్నాం. 108 సూర్యనమస్కారాలు, 108 రోజులు చేసిన వారికి ఇవ్వనున్నాం. వంద మందితో 108 ఆసనాలు వేయిస్తాం. పాటలు పాడడం, నృత్యం ఇలా ఏ కళలో అయినా ఇదివరకు ఎవరూ చేయనివి చేయగలం అనుకుంటే వండర్‌బుక్ ఆఫ్ రికార్డు వెబ్‌సైట్ ద్వారా సంప్రదించవచ్చు. రికార్డు నమోదు అనేది 170 దేశాల్లో కొనసాగుతోంది.

– డాక్టర్ జ్యోతి రంగ, ఇంటర్నేషల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు సౌత్ ఇండియా కోఆర్డినేటర్

శిక్షణ కేంద్రం సందర్శన



ఏడీ నాగేంద్రంను సన్మానిస్తున్న మహిళలు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండల కేంద్రంలోని ఫకీర్‌గుట్ట కాలనీలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్) కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం సందర్శించారు. అభ్యర్థులకు అందిస్తున్న శిక్షణ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలు ఏడీని సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖదీరా బేగం, నిఖత్ ఫర్హీన్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ వచ్చినా తీరని నీటి సమస్య

- మూడు గూడేలకు ఒకటే చేతిపంపు దిక్కు
- వారం రోజులుగా సరఫరాకాని మిషన్ భగీరథ నీరు



సుంగాపూర్ కొలాంగూడలోని చేతిపంపు వద్ద మహిళలు

నార్నూర్(ఆసిఫాబాద్): మండలంలోని సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండా, కొలంగూడ, గోండుగూడేల్లో 700కు పైగా ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆయా గ్రామాలు ఏర్పడి 80 సంవత్సరాలు కావస్తున్నా నీటి సమస్య పరిష్కారం కావడంలేదు. వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మూడుగూడేలకు కలిపి ఒక్కటే చేతి పంపు ఉండడంతో బిందెడు నీటి కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. గూడేల్లో నీటి సమస్యపై గత మేలో 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ స్వయంగా సుంగాపూర్ గోండుగూడ గ్రామాలను సందర్శించి నీటి సమస్యపై ఆరా తీశారు. గిరిజనులు నీటిని తెచ్చుకుంటున్న బావిని పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాశ్వత నీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతో గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న బావి నుంచి గ్రామానికి ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



శంకర్ పటేల్(ఫైల్)

భైంసాటౌన్(ముథోల్): మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పిప్రి కాలనీకి చెందిన శంకర్‌పటేల్ (45) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో భార్యతో తరచూ గొడవ పడేవాడు. శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. పురుగుల మందు వాసన రావడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య గీతాబాయి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య



నందకిశోర్(ఫైల్)

బజార్‌హత్నూర్(బోథ్): మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన గెడం కాశీనాథ్, శాంతాబాయి దంపతుల కుమారుడు గెడం నందకిశోర్ (26) ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో డీఎడ్ చదువుతున్నాడు. చివరి సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ కావడంతో రెండు రోజులుగా మనస్తాపానికి గురయ్యాడు. శనివారం బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో టేకు చెట్టుకు ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడెం(ఖానాపూర్): ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై రాజు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన జాడి కిరణ్ (27) గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఒళ్లంతా గాయాలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 15న కడెం మండల కేంద్రంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఇచ్చోడ(బోథ్): ఈ నెల 11న రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని ముఖరా(బి) గ్రామానికి చెందిన నూర్‌ఖాన్ (62) హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై రాణి జిన్నింగ్ ఫ్యాక్టరీ వద్ద వెనక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి.

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ధర్ము, సతీష్, కిషన్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ధర్ముకి తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కోస్మెట్టి శ్యాంసుందర్ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం కిరాణా సరుకులు కొనడానికి వెళ్లిన శ్యాంసుందర్ దుకాణం ఎదుట బైక్ నిలిపాడు. సరుకులు తీసుకుని వచ్చేసరికి బైక్ కనిపించలేదు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

నిర్మల్ చేరిన విజయేంద్ర సరస్వతి యాత్ర





నిర్మల్‌చైన్‌గేట్: కంచి కామకోటి సర్వజ్ఞ పీఠాధీశ్వరులు జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతీ స్వామిజీ చేపట్టిన విజయయాత్ర శనివారం సాయంత్రం నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. స్వామి వారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. బ్రహ్మపురి రామమందిరం నుంచి బ్రహ్మపురి రథాలగుడిలోని బ్రాహ్మణ భవనం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామివారు భక్తులకు అనుగ్రహ సందేశం ఇచ్చారు.

వడదెబ్బతో బాలిక మృతి

సిర్పూర్(టి): వడదెబ్బతో బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని చీలపెల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లెండుగురె సోమయ్య కుమార్తె మహేశ్వరి(8) వడదెబ్బకు గురికావడంతో రెండు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతోంది. సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారు జామున మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.